క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు - నలుగురికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఐదుగురు వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. సదరు ఐదుగురు వాహనదారులను సోమవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి శివధర్ ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, మరో నలుగురికి రూ.13వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇకపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా అమలు చేస్తామన్నారు.

దేవాలయానికి రూ. 51వేల విరాళం

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయ గర్భగుడి, శిఖరం పునర్నిర్మాణం కోసం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు జి.చంద్రయ్య, విజయలక్ష్మి దంపతులు సోమవారం రూ. 51,116ల విరాళం దేవాలయ పూజారి నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

న్యూ ఉషా సంయుక్త కార్యదర్శిగా కేశవ్‌గౌడ్

జడ్చర్ల టౌన్: ఉమ్మడి జిల్లా న్యూ ఉషా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా మండలంలోని గంగాపురానికి చెందిన మాస్టర్ కేశవ్‌గౌడ్‌ను నియమించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు మహమ్మద్ ఇమ్రాన్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. తన నియామకం పట్ల రాష్ట్ర అసోసియేషన్ సభ్యులకు కేశవ్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్



జడ్చర్ల: జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చిన ఆయన విధుల్లో చేరారు. పట్టణ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాజ్‌గోపాల్‌రెడ్డి హైదరాబాద్‌లో చికిత్స చేయించుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జి.జయన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

హెచ్‌సీయూలో ఎస్‌ఎఫ్‌ఐ గెలుపుపై హర్షం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయం సాధించడంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో హర్షం వ్యక్తం చేశారు. ఏబీవీపీని విద్యార్థులు విజ్ఞతతో ఓడిచడం గొప్ప విషయమని, కేంద్రంలో బీజేపీ విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఇటువంటి ఫలితాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో భరత్, ప్రశాంత్, నందు, ఈశ్వర్, రమేష్, బన్నీ, శ్రీనాథ్, సాయి, శివ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా చంద్రకాంత్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఎం పట్టణ కార్యదర్శిగా చంద్రకాంత్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా పద్మ, రాజ్‌కుమార్, గాలన్న, అనురాధ, సయ్యద్‌గౌస్, విష్ణువర్ధన్, మోహన్‌లు ఎన్నికయ్యారు. పట్టణంలో ప్రజలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు పోరాటం చేస్తామని తెలిపారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మిడ్జిల్: మండలంలో సోమవారం వరకు 5,616 పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శివరాజ్ తెలిపారు. మండలంలో మొత్తం మూడు బృందాల ద్వారా వస్పుల, కొత్తపల్లి, దోనూర్, చేద్ ఘాట్ తండా, వేముల, మసిగొండ్లపల్లి, బోయిన్‌పల్లి, మల్లాపూర్, మున్ననూర్, కొత్తూర్, అయ్యవారిపల్లి, చిల్వేర్ గ్రామాల్లో టీకాలు వేసినట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కారం

- డీఎల్‌ఎస్‌ఏ సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర



హాజరైన రైతులు



దేవరకద్రలో లీగల్ చట్టాలపై మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

దేవరకద్ర: రైతులు తమ సమస్యలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని డీఎల్‌ఎస్‌ఏ సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర సూచించారు. సోమవారం దేవరకద్ర రైతు వేదికలో వ్యవసాయ రంగానికి సంబంధించిన లీగల్ చట్టాలపై అవగాహన కల్పించారు. రైతులు తమ సమస్యలతో కోర్టుకు వెళ్లకుండా లోక్ అదాలత్ చట్టాన్ని ఆశ్రయించి, ఎలాంటి లాయర్ ఫీజు, ప్రాసెసింగ్ రుసుం లేకుండా పిటిషన్ వేసి పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీమార్గం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయనే విషయం రైతులు గుర్తించుకోవాలన్నారు. రైతులు చట్టాల గురించి తెలుసుకోవాలని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతుల భూతగాదాలకు సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కారాలు, సాగు భూమిలో బోర్లు వేసుకునేందుకు తీసుకోవలిసిన అనుమతులపై వివరించారు. సమావేశంలో ఏడీఏ యశ్వంతరావు, మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, ఎస్‌ఐ నాగన్న, వివిధ గ్రామాల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'అదనపు పోలీస్ సిబ్బందిని ఇవ్వండి'



నవాబుపేట ఎంపీడీఓ కార్యాలయం

జడ్చర్ల: జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు అదనపు సిబ్బందిని నియమించాలని డీజీపీ జితేందర్‌ను సోమవారం కలిసి కోరినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్లలో పెరుగుతున్న జనాభా అవసరాలు, వ్యాపారాలు తదితర లావాదేవీలను దృష్టిలో పెట్టుకుని సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. స్థానికులు, స్థానికేతరుల జనాభా 1.25 లక్షలు ఉందని, వీరుగాక ఇతర ప్రాంతాల నుంచి నిత్యం 30వేల మంది రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అంతేగాక 44,167 నంబర్ల జాతీయ రహదారులు ఇక్కడే కలుస్తాయన్నారు. ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా ఉందని, సకాలంలో ప్రజలకు సేవలు అందించేందుకు పోలీస్ సిబ్బందిని అదనంగా నియమించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

స్పెషల్ అధికారుల పాలనపై ఎమ్మెల్యే ఆరా..

నవాబుపేట: 'మండలంలో ఏం జరుగుతుంది? స్పెషల్ అధికారులు ఏం చేస్తున్నారు? మొత్తం సమాచారం కావాలి. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సరిపోదు' అంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మండల అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. ఇటీవల మండలంలో గ్రామ పంచాయతీలలో శానిటేషన్ నిధులు, తదితర వాటి విషయంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఆయన మండల అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో అధికారులు అలర్ట్ అయ్యారు. రెండు రోజుల్లో మండల పూర్తి సమాచారం అందించాలని ఎంపీడీఓను ఎమ్మెల్యే ఆదేశించినట్లు సమాచారం.

సెలవుల్లో అధికారులు

ఎమ్మెల్యే హెచ్చరికతో అన్ని వివరాలు సిద్ధం చేయాలని మండల పైస్థాయి అధికారి వివిధ విభాగాలకు ఆదేశాలు ఇవ్వడంతో కొందరు సెలవు పెట్టి వెళ్లినట్లు సమాచారం. దీంతో మండలంలో ప్రత్యేక పాలనలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రత్యేక చర్చకు తెరలేపింది.

ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి



నాయీబ్రహ్మణ ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నాయీబ్రహ్మణుల ఆరాధ్య దైవం ఆయుర్వేదానికి మూల పురుషుడు భగవాన్ ధన్వంతరి స్వామి జయంతి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఆయుర్వేద కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ సారంగపాణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో ధన్వంతరి స్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు నితీష్‌చంద్ర, రాఘవేందర్‌లను సన్మానించారు. ఎంబీబీఎస్ విద్యార్థిని 'భాగ్యలక్ష్మి చదువుకు ఆర్థిక కష్టాలు' అనే శీర్షికతో 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన సంఘం నాయకులు ఆమెకు ఆర్థిక సాయం చేశారు. దీంతో పాటు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారిని, ప్రమోషన్లు పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమలో రామనందస్వామి, నాయీబ్రహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, నారు, బాలరాజు, రవి, వేణుగోపాల్, రాములు, నర్సింహులు, నారాయణ, వెంకటేశ్వర్లు, సేనాపతి, బాలస్వామి, రాఘవేందర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు



దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి పలువురు సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. మూడు ఫిర్యాదులు వచ్చాయని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈఓ బలరాం, ఏఈ కీర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

జడ్చర్ల టౌన్: ప్రతి సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 5 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిలో 3 దరఖాస్తులు మున్సిపాలిటీకి సంబంధించినవి కాగా, రెండు రెవెన్యూ ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ప్రజావాణిలో మండల అధికారులు అందరు హాజరవుతారని, ఏ శాఖకు సంబంధించిన సమస్య అయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ప్రజావాణిలో 2 దరఖాస్తులు

నవాబుపేట: మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాం నాయక్‌లు తెలిపారు. వాటిలో ఒక దరఖాస్తు అక్కడే పరిష్కరించినట్లు వారు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం ప్రజావాణిలో 16 దరఖాస్తులు రాగా, వాటిలో 8 మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు వారు తెలిపారు. మిగతా 8 మాత్రం పరిశీలనలో ఉన్నట్లు వారు వివరించారు.

రాజాపూర్‌లో మూడు దరఖాస్తులు



రాజాపూర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి సోమవారం ప్రజావాణికి మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సంబంధిత శాఖ అధికారులు, గ్రామాల కార్యదర్శులు ఉదయం నుంచి 2గంటల దాకా అక్కడే కూర్చోవల్సి వస్తోందని పేర్కొన్నారు.

విద్యార్థులకు వర్ణమాల నేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: పాఠశాలకు హాజరయ్యే ప్రతి విద్యార్థికి వర్ణమాల, గుణింతాలు తప్పనిసరిగా వచ్చేలా చూడాలని ఎంఈఓ మంజులాదేవి సూచించారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతికి వచ్చినప్పటికి కొంతమంది విద్యార్థులకు చదవటం, రాయటం రావటం లేదని, ఇటీవల కలెక్టర్ తనిఖీలో వెల్లడైందన్నారు. విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చి చదవటం, రాయటం వచ్చేలా చూడాలన్నారు. అందుకు వర్ణమాల, గుణింతాలు నేర్చుకునేలా చూడాలన్నారు. విధుల్లో ఉండగా సెల్‌ఫోన్ వినియోగించరాదని, సమయపాలన పాటించాలన్నారు. నవంబర్ 4 నుంచి సెలవులో వెళ్లని ఉపాధ్యాయులను కలెక్టర్ సత్కరిస్తారని వెల్లడించారు. నవంబర్ 6 నాటికి పదో తరగతి ఎస్‌ఏ పరీక్షల ఫలితాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. సమావేశంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వాసంతో సమస్యలు జయించాలి



ముడా చైర్మన్‌ను సన్మానించిన ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవునిపై విశ్వాసంతో సమస్యలు జయించాలని బీవీ కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కన్వెన్షన్ హాల్లో సోమవారం రక్షణ దుర్గం, జీసస్ పవర్ అపోస్తలిక్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో దాసరి సామేల్ అధ్యక్షతన దైవసేవకుల ఉమ్మడి జిల్లా వేదిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి, చెడు, విచక్షణ, జ్ఞానం, సమతుల్యత కలిగి ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలన్నారు. సువార్తగాయకుడు అనిల్ స్తుతి ఆరాధన చేశారు. అభి శ్రీకాంత్ బైబిల్ పఠనం చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 మంది పాల్గొన్నారు. అనంతరం ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేటీ.బెంజిబెన్, జాన్సన్‌పాల్, ప్రసాద్, ఆశీర్వాదం, విజయ్‌కుమార్, సామెల్, డీఆర్‌వీ.ప్రసాదరావు, సుందర్, బెంజిమెన్, శ్యాంసన్, మధు, శ్రీధర్ పాల్గొన్నారు.

సేవాలాల్ దేవాలయ స్థలం కోసం వినతి



హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన గిరిజనులు

నవాబుపేట: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ దేవాలయ నిర్మాణం కోసం మండలంలోని యన్మన్‌గండ్ల గద్దగుండు చెంత స్థలం కేటాయించాలని సేవాలాల్ సంఘం నాయకులు మంత్రి, ఎమ్మెల్యేలను కలిసి విన్నవించారు. సోమవారం హైదరాబాద్‌లో సెక్రటరేట్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలను కలిసి విన్నవించారు. నవాబుపేట, మహబూబ్‌నగర్ రోడ్డులో గద్దగుండు చెంత గల స్థలంలో రెండెకరాలు దేవాలయ నిర్మాణం కోసం సర్వే సైతం చేసినట్లు దీనికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ నూతన దేవాలయం నిర్మాణం కోసం కృషి చేస్తామని, రెండేళ్లలో దేవాలయ నిర్మాణం పూర్తి చేసేలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో లంబాడిహక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌నాయక్, సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నీల్యా, మంగ్యానాయక్, శంకర్‌నాయక్, భాస్కర్, తదితరులు ఉన్నారు.

వందేళ్ల సేవాదళ్ వేడుకలు నిర్వహిద్దాం



మాట్లాడుతున్న అన్వర్‌పాష

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని సేవాదళ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వాజిద్ మహెక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాజిద్ మహెక్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే వందేళ్ల సేవాదళ్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల్లో అర్హులైన సేవాదళ్ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌పాష, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ మాట్లాడారు. సమావేశంలో జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు లోక్‌నాథ్, పట్టణ అధ్యక్షులు అలీ, అసెంబ్లీ అధ్యక్షులు జగదీశ్వర్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

- పంచశీల పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ రాజునాయక్



మహమ్మదాబాద్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రాజునాయక్

మహమ్మదాబాద్: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మేనేజ్‌మెంట్‌దేనని మండల విద్యాధికారి రాజునాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పంచశీల పాఠశాలను ఆయన పరిశీలించారు. అప్పటికే పాఠశాల భవనానికి రెంటు చెల్లించకపోవడంతో ఓనర్ ఆఫీసుకు తాళం వేసుకుని వెళ్లాడు. దీంతో ఆఫీసులోనే రికార్డులు ఉండడంతో ఎంఈఓకు చూపించలేదు. సాయంత్రమైనా తనకు రికార్డులు, అనుమతి పత్రాలు చూపించాలని ఆదేశించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎంఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రిన్సిపల్ తరగతుల వారీగా పరిశీలించాలని, బోధనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. తరగతుల్లో విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

దేవరకద్ర: విద్యార్థుల సామర్థ్యాలు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి బలరాం కోరారు. మండల వనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనక బడిన విద్యార్థులను గుర్తించి వారి విద్యా ప్రమాణాలు పెంచాలని సూచించారు. సమావేశంలో వనరుల కేంద్రం సిబ్బంది చంద్రశేఖర్‌గౌడ్, రాధిక, శారద తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



కోయిల్‌కొండ: జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రెడ్డిగారి రవీందర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.విద్యాసాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో రవీందర్‌రెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, బండియాదవ్ కుమార్, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, చెన్నారెడ్డి, విఠల్, గౌస్, శేఖర్, రామస్వామి, నాగరాజు, యునుస్‌అలీ, మనోజ్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారికి పే స్కేల్‌ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సర్క్యులర్ 4778ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాల్, నారాయణగౌడ్, అంజయ్య, చంద్రశేఖర్‌గౌడ్, హుస్సేన్, వెంకట్‌నాయక్, రాజ్‌కుమార్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయండి



మూసాపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

భూత్పూర్/అడ్డాకుల: జడ్చర్లలో 30న ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగే ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. జడ్చర్ల చంద్రా గార్డెన్‌లో నిర్వహించే ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీరాములు, ఖాదరయ్య, రాజు, కేశవులు, కమలాకర్, ఎం.సురేందర్, భూత్పూర్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కో–ఆర్డినేటర్ కె. బాల్‌రాజు రామస్వామి, యాదయ్య, నర్సింహులు, చెన్నయ్య, వెంకటయ్య, సాయిలు, మొగులప్ప, వెంకట్రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ బాటిళ్ల పంపిణీ



విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేసిన ఎంఈఓ ఉషా

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని రామచంద్రాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను ఎంఈఓ ఉషా పంపిణీ చేశారు. దాతలు రాహుల్ బిన్ని, దీపక్ బిన్ని, జగన్ బిన్ని, రఘుయాదవ్‌ల సహకారంతో విద్యార్థులకు బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిచ్చన్న, బాలపీర్, మురళి, జ్ఞానేశ్వర్‌సింగ్, పద్మప్రియ, ఆనంద్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని అమలు చేయాలి



రాజాపూర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రాజాపూర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 4 డీఏలు, పీఆర్‌సీతో పాటు ఈ కుబేర్‌లో పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సోమవారం టీపీయూఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ మండల అధ్యక్షులు ప్రవీన్‌కుమార్ మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా ఆర్థిక పరమైన ప్రయోజనం కలుగలేదన్నారు. నవంబర్ 22 వరకు తమ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే 23 నుంచి హైదరాబాద్‌లో ధర్మాగ్రహదీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ కార్యదర్శులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రేణుక, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల డిమాండ్లు పరిష్కరించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమ కారుల డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమ కారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో అదిలాబాద్ జిల్లా నుంచి ఓయూ ఆర్ట్స్ కాలేజీ వరకు నిర్వహించిన పాదయాత్ర సోమవారం ఓయూకు చేరింది. ఈ పాదయాత్రలో జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల హక్కుల సాధనకోసం ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ కారులకు సరైన గుర్తింపు ఇవ్వాలని కోరారు. రజక రిజర్వేషన్ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివన్న, తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన
Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618056349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
మహబూబ్‌నగర్ మహ్మద్ తౌసిఫ్ అలీ - 73969 95582
కోస్గి కె. రమేష్ - 99486 98552
జడ్చర్ల సి. అంజనేయులు - 80966 88450

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : జి. శివుడు, యాడ్స్ మేనేజర్ - 9951602029

రంజిత్ కుమార్ - 90102 34478
కేశవులు - 90105 22215
శ్రీశైలం - 97051 35557
వెంకటయ్య - 90108 69797